# ముసుగు

## విరగబడి నవ్వేడు చిదంబరం

ఉన్నట్టుండి అలా వికటాట్టహాసం చేసినందుకు మిగతా ఇద్దరికీ మూర్ఛవచ్చినంత పనైంది. దించిన గ్లాసులు మరిపైకెత్తకుండా, ఎత్తిన కనురెప్పలు మరి వాల్చకుండా అలా చిదంబరం వైపు చూస్తోపుండిపోయేరు,

ఇదేవిటి? ఈ మానవుడు అప్పుడే గుర్రం ఎక్కేసేడా?

అబ్బే! వాళ్ళ అనుభవంలో ఇంతకుముందు ఎన్నడూ అలా జరగలేదు. పెదవి ఆరకుండా తెల్లవాళ్లూ మందు పుచ్చుకున్నా మనిషి మాట జారదే?

ఏదో ఊహించని విపత్తుముంచుకొచ్చినంతగా రాపడి పోయేరువాళ్లు.

బయట చీకటి చౌర్యవిహారం చేస్తోంది. లోపల గదిలోనూ అది గప్మత్తుగా దోబూచులాడుతోంది.

గుండ్రటి టీపాయ్ చుట్టూ కూర్చొన్నారు. వాళ్ల తలమీద షేడ్‌లోంచి ఎర్రటి విద్యుద్దీపం నెత్తుటి కాంతి చిమ్ముతోంది. పైగది గుమ్మంలోంచి చూస్తే వాళ్లమీదికి ప్రసరిస్తోన్న ఎర్రటి కాంతి వర్తులం పెద్ద వ్రణంలా కన్పిస్తోంది. వాళ్లు ముగ్గురూ అందులో కదలాడుతోన్న క్రిముల్లా వున్నారు.

"ఎందుకలా చూస్తారు? కానివ్వండి?" అన్నాడు చిదంబరం.

అతగాడంత సౌమ్యంగా మాట్లాడినా వీళ్ల అనుమానం తీరలేదు.

చిదంబరం గ్లాసు పైకెత్తి రెండు గుక్కలు మింగి చప్పరించేడు. చప్పరించి మళ్లీ నవ్వేడు. ఇది వికటాట్టహాసం కాదు మంద(దు)హాసం.

"ఈ దేవుళ్లనీ కోర్టుల్నీ ఎవడు సృష్టించేడోగాని నిజానికి మనం వాణ్ని పూజించాలి" అన్నాడు చిదంబరం. అని చాల సేపయింది. అయినా అతని పెదాలమీంచి హాసం ఇంకా జారిపోలేదు.

—ఇదా బాబూ తమ వికటాట్టహాసానికి కారణం, అనుకున్నాడు జస్టిస్ రామస్వామి.

రామస్వామి గొప్ప రామభక్తుడు. నిజం చెప్పాలంటే ఆ రాముడి తాలూకు ఏ అవతారానికైనా అతడు విధేయుడే. రాముడి పేరుతో ముద్దాయి కన్పించినా భక్తి ప్రపత్తులతో వినమ్రుడైపోతాడు. అతడు జడ్జీ అయినా కూడా వేకువనే లేచి వాకింగు ముగించుకొని, స్నానం చేసి, శ్రీరామ విగ్రహం ముందు అరగంటసేపు ఆంజనేయుడిలా కుప్పిగంతులువేసి భజన చేస్తేతప్ప అతనికి సంతృప్తి వుండదు.

రామస్వామి కేవలం రామభక్తుడేకాదు. ఆ తారకరాముడి తాలూకు సర్వసద్గుణాలనీ సంతరించుకున్న పురుషోత్తముడిగా ఆయన బంధుకోటిలో ప్రసిద్ధుడు.

ఆ రాముడిదొక్కటే బాణం.

ఈ రాముడిదొక్కటే తీర్పు.

ఒక్క జానకి దగ్గరే ఆ రాముడితో ఈ రాముడి సామ్యం భేదించింది. ఆ జానకి రాముడి యాజ్ఞతో అగ్ని దూకిన సాధ్వి. ఈ జానకి మన అభినవ రాముడి ఓర్పుకే అగ్నిపరీక్ష.

"జానకీ, నీకింతటి సౌమ్యమైన పేరు ఎవరు పెట్టేరోగాని...." అంటో వుంటాడు అప్పుడప్పుడూ భార్యను వుద్దేశించి అలాంటప్పుడామె తాళ ప్రమాణంలో లేచి తాటకిలా విజృంభిస్తుంది.

"అంటే ఏవిటి మీ వుద్దేశం. గయ్యాళి గంపననేగా! ఈ గయ్యాళిగంపే లేకపోతే మీరెక్కడ వుండేవారో! నేనుగదా మీకు చదువు చెప్పించి మనిషిని చేసింది? నేను గదా మీకు ప్రాక్టీసు లేకపోతే పదేళ్లు పోషించింది? నేనుగదా మీకు గవర్నమెంటు ప్లీడరీ ఇప్పించింది? నా మూలంగా కాదా మీకీ జడ్జి పదవి వచ్చింది? నా వల్ల ...." అంటూ ఓ దండకం మొదలెడుతుంది.

ఆమె మూలంగా అన్ని ఘనకార్యాలు ఎలా జరిగేయనేది అప్రస్తుతం. అసలా యనే వాటి గురించి ఆలోచించనప్పుడు మనకెందుకు? అయితే అదంతా ఆమె చలవేనని మాత్రం ఇప్పటికీ అతని విశ్వాసం.

రెండుసార్లు బి.ఎ. తప్పితే మరింక పనికిరాడనే నమ్మకంతో పెళ్ళి చేసేసేడు వాళ్ల నాన్న. అదీ పాసయ్యేడని మభ్యపెట్టి పాతికవేలు కట్నం గుంజి మరీ పెళ్ళిచేసేడు మరింక అతని భారం లేకుండా ఇల్లరికం ఏర్పాటుకూడా చేసేడు వాళ్ళ నాన్న. పెళ్ళయిన సంవత్సరమే బియ్యే పాసవటమూ, ఆ తర్వాత లా చదువూ, వృత్తీ వృత్తిలో ఒక్కొక్క మెట్టే ఆరోహణం.... ఆమె పాణిగ్రహణ వేళావిశేషంగాక మరేవిటి? అందుకే ఆమె సీతాదేవి కాకపోయినా అతను మాత్రం ఆమెపట్ల అచ్చమైన శ్రీరామ చంద్రుడిగానే మసులుకుంటాడు. అందుకు ఒక దృష్టాంతంగా కట్టుకున్న మూడంతస్తుల సుందర భవంతికీ "జానకీ నిలయం" అని నామకరణం చేసేడు. అంతేకాదు.

"పరస్త్రీని కన్నెత్తి చూడడు".

"మద్యం ముట్టడు."

"కాఫీ టీలు తాగడు."

"ఆ మాటకొస్తే "భార్య చేతిమీదుగా గాని మంచి నీళ్ళయినా ముట్టడు" అనే

కె.కె. మీనన్

సత్కీర్తిని సాటివారిలో స్థిరపర్చుకున్నాడు.

గ్లాసు పైకెత్తి సగం గొంతులో పోసుకున్నాడు రామభక్తుడు.

– ఎంత మినిష్టరైతే మాత్రం అంత పొగరా? దైవదర్శనానికొచ్చి దేవుళ్ళ పరిహసిస్తారా? ఒక హైకోర్టు జడ్జీ ...ందు కోర్టుల్నే గేలి చేస్తారా?

అపుకోలేనంత కోపం వచ్చింది రామస్వామికి. కాని ఏం చేసుకోను ఆకోపాన్ని? కోప కారణమైన అవతలి వ్యక్తి సాధారణ మానవుడు కాకపోయే. మంత్రి కాకపోయే ముఖ్యమంత్రి. ఆ శ్రీరామచంద్రుడు దయ తలిస్తే, కాలం కలిసివస్తే, జాతక వచ్చిన వేళావిశేషం మారకుండా వుంటే అతగాడు ముఖ్యమంత్రి కాకపోతాడా? తను హైకోర్టు ప్రధానన్యాయమూర్తో లేక సుప్రీం కోర్టు న్యాయాధిపతో కాకుండా వుంటాడా?




అందుకే మాట్లాడలేదు. నోరువిప్పి అతని అఘాయిత్యాన్ని ఆపలేదు.

"మీ వృత్తినీ, మీరు నమ్ముకున్న దేవుళ్ళనీ గేలిచేస్తున్నానని కోప్పడుతున్నారా జడ్జీగారూ...."

"అబ్బే....నేనేం కోప్పడ్డం లేదండీ."

"పోనీ బాధ పడుతున్నారు. అవునా? అయినా నేనన్నది ఏమున్నది? దేవుళ్ళ గొప్పతనాన్నీ, కోర్టుల న్యాయ విధుల్నీ వేనోళ్ళ పొగుడుతున్నాను. అంతే...."

ఆ మాటలు విన్నాక నేను హఠాత్తుగా నాస్తికుడైపోయినంత కోపం వచ్చింది దేవుడమ్మకి. అలా కోపం రావటానికి దేవుడమ్మ ఏకోర్టులోనూ జడ్జీకాదు. కనీసం ప్లీడరైనా కాదు. ఏ దేవాలయంలోనూ




అర్చకుడు కాకూడదు. కాని, ఈ రెంటినీ నమ్ముకుని అభివృద్ధిలోకి వస్తున్న "ఫి. క్లాసు" కాంట్రాక్టరు. అని పేరె దేవుడమ్మ. వాళ్ళమ్మకి లేక లేక కలిగి, దేవుడిమీద ఎనలేని విశ్వాసం కలిగించి, దేవుడమ్మయ్యేడు దేవుడమ్మ. పరాయివాళ్ల పాలౌతుందనుకున్న ఆస్తికి వారసుడయ్యేడు. దాన్ని పెంచి పోషించే నాధుడయ్యేడు. స్థానిక దేవుళ్ళకి కొంతమందికి ధర్మకర్తయ్యేడు. ప్లీడర్లకీ, జడ్జీలకీ, పిడబ్ల్యూడీ గుమాస్తాలకీ రాజపోషకుడయ్యేడు. అధికార పార్టీ ఎన్నికల నిధులకి నిధయ్యేడు. తన ఆస్తినీ, ఆధిక్యతనీ కంటికి పాపలా కాపాడుతోన్న ఈ వ్యవస్థనీ, దాని కొమ్ముకాస్తోన్న కోర్టుల్నీ దేవుళ్ళనీ ఎవరైనా ఏమన్నాఅంటే చచ్చేంత కోపం వస్తుంది దేవుడమ్మకి. తగని కసి పుడుతుంది. ఎంతకసి పుడుతుందంటే, అలా దూషించిన వాణ్ని కోర్టులకీ, వాటి అంధనేత్రాల సాక్షులకీ అందనంత దూరం పంపించేయాలన్నంతకోపం వస్తుంది. కాని, కాని....ఆ వ్యక్తి సామాన్యుడు కాకపోయేడు. అందుకే అది చచ్చే కోపమేగాని కసి కోపం కాలేకపోయింది.

"ఇంతకీ మీరిక్కడికి ఎందుకొచ్చినట్టు చిదంబరంగారూ" అనడిగేడు దేవుడమ్మ. దేవుడి గెస్టు హౌస్‌లో కూర్చుని ఆ మాట అడిగినందుకే సగం పాపం చేసినట్టుగా విలవిల్లాడిపోయేడు. అది భరించలేక గ్లాసు చేతిలోకితీసుకుని గటగటా రెండుగుక్కల్లో ఖాళీచేసేసి టీపాయ్‌మీద పెట్టేసేడు. అసలు పాపమంటే ఏమిటో ఎరగని చిదంబరం మరో సీసా మూత విప్పి ఆ ఖాళీ గ్లాసు నింపేడు.

చిదంబరం అంటే చిన్ననాటి స్నేహితుడు మాత్రమేకాడు దేవుడమ్మకి. ఆత్మీయుడు, ఆరాధ్యుడు, ఎమ్మెల్యే రోజుల్నుంచి తన వృత్తిలో, దానిలావాదేవీల్లో ఎదురయ్యే అవరోధాలన్నిటినీ "చెక్రం" అడ్డేసి నిరోధిస్తూ వస్తున్న అప్పుడు. అవసరమైతే సలహాలిచ్చి నడిపించే ఆంతరంగికుడు. ఆ ఆత్మీయత ఇలాంటి సుందర సన్నివేశాల ద్వారా మరింత పెరిగి, మూడు సీసాలూ, ఆరు గ్లాసులుగా వర్ధిల్లుతోంది. అయినా అతని హద్దులేవిటో అతనికి తెల్సు. మంత్రిగానే గాని, మిత్రుడుగా అతని ముందు ప్రవర్తించడు.


"ఎందుకొచ్చేమో మనందరికీ తెల్సురా దేవుడూ. అందుకే కోర్టుల్నీ, దేవుళ్ళనీ సృష్టించిన ఆ మహామేధావి మనకి ఎంత మేలుచేసేడో రెండు సీసాలు ఖాళీచేసినా మర్చిపోలేకుండా వున్నాను."

"ఎలాగంటావేమో? చెప్తా విను. నువు వెంకునాయుణ్ని పల్లిగ్గా రోడ్డు మీద హత్య చేయించేవు. ఏమయింది? కింది కోర్టులో నీకు అనుకూలంగా సాక్ష్యాలు పలికించినా నెగ్గలేకపోయేవు. పై కోర్టుకెళ్ళేవు. అక్కడ జడ్జీగారికి, అక్షరాలా వీరికే; యాభై వేలు చదివించుకుని కేసు కొట్టేయించేవు. అయినా పాపభీతి మాసిపోలేదు. పాపాల్ని దేవుడే తుడిచిపారెయ్యాలిగాని, కోర్టులు కొట్టిపారెయ్యలేవుగా. అందుకే లక్ష రూపాయలు హుండీలో పారేసి హాయిగా మందు కొట్టేస్తున్నావు. నువు కట్టిన బ్రిడ్జీ కూలిపోతే, అందుకు ప్రభుత్వం వారు ఒక పరిశీలనా సంఘాన్ని నియమిస్తే అది నీకు అనుకూలంగా రాసినందుకు నాకో లక్ష పారేశావు. అందులో ఓ పాతిక దేవుడి మొహాన్న పారేసి నేనూ నీతోబాటు మందు దట్టించేస్తున్నాను. ఇంత సుఖమైన, సుఖమైన ఏర్పాటు మరెక్కడుంది చెప్పు." అని అలా తన వికటాట్టహాసం యొక్క ఆంతర్యాన్ని విపులీకరిస్తూ వుంటే, అనవసరంగా తనను కూడా ఇరికించినందుకు మన రామభక్తుడికి ఆపుకోలేనంత కోపం వచ్చేసింది.

"నా పైని మీరు అన్యాయంగా నేరాన్ని ఆపాదిస్తున్నారు. నా గురించి మీకేమీ తెలీదు" అన్నాడు.

"అలాగా....అయితే మీ గురించి మీకే తెలియదని అనిపిస్తోంది. మిమ్మల్ని గవర్నమెంటు ప్లీడరుగా నియమించినందుకూ, ఆ తర్వాత జడ్జీ పదవి ఇప్పించినందుకూ మీ మామగారు నాకెంత సమర్పించుకున్నారో మీ రెరుగుదురా? ఖచ్చితంగా ఎరుగుదురు. ఎంచేతనంటే ఖర్చు చేసిన డబ్బు మీరు రాబట్టలేకపోతున్నారని మీ ఆవిడ 'మాటిమాటికీ ముల్లు కర్రతో పొడుస్తూవుంటేనే గాళ్ళో వద్దారన్నది మీకు తెలియకపోతే ఎవరికి తెలుస్తుంది?"

"అంతేకాదు. మీరు తాగుతారనీ, ఇప్పు




ఇప్పుడే పైగదిలోంచి స్నానంచేసి దిగి వచ్చేరనీ ఎవరికైనా తెల్సా? కనీసం ఆవిడకి. కింద కాటేజీలో ఆదమరిచి నిద్రపోతోన్న ఆ సీతమ్మతల్లికి. ఊహు .. తెలీదు. మీరు ఆమె చెవిలో గీపెట్టిచెప్పినా ఇక్కడ ఇంతటి పుణ్య కార్యాలు జరుగుతున్నాయని ఆమె చచ్చినా నమ్మదు. ఇది పుణ్యక్షేత్రం" అని లెక్చరు ముగించేడు చిదంబరం.

ఎవ్వరూ మాట్లాడలేదు. కాని, ఇళ్ల మీదనించి మాత్రం కేక వినిపించింది

"సర్. తెల్లవారవస్తోంది. నాకింక సెలవిప్పించండి" అంది ఓ చిన్నది.

"చూడు దేవుడూ దాన్ని పంపించెయ్"

దేవుడమ్మ పైకెళ్ళి వాళ్ళ సుఖానికి సుంకం చెల్లించి వచ్చేడు.

"థేంక్స్ సర్.... మీ మేలు మర్చిపోలేను" అందామె.

"మంచిది వెళ్ళిరా."

"నా బేగ్ సర్...."

"ఎక్కడ?"

"ఆ టీపాయ్ కింద" అని ముందుకు వచ్చి, వంగి బేగ్ తీసుకుని, వయ్యారంగా వెళ్ళిపోయింది.

"దీనిమట్టుకిది పెద్ద పతివ్రతలా లెక్క ఒచ్చింది. అది అలాంటిది కాదుట. అవసరం వచ్చింది కాబట్టిగాని లేకపోతే ఆ పాపపు పని చేసేదికాదుట."

"ఏవిటో ఆ అవసరం?" అడిగేడు దేవుడమ్మ.

"నీకు చెప్పలేదా? అయితే రామస్వామికి చెప్పి వుంటుంది."

"ఊహు....నాకూ చెప్పలేదు."

"అయితే నీకూ చెప్పలేదన్నమాట. సరే, అయితే చెబుతా వినండి. దాని మొగుడు చావు బతుకుల్లో వున్నాడట. చచ్చే ముందు ఒకసారి తిరుపతి దేవుణ్ని చూడాలని కోరేడుట. ఎలాగో నానా తంటాలూ పడి తీసుకొచ్చిందిట. మరి తిరిగెళ్టానికి డబ్బులేక తనువు తాకట్టు పెట్టాల్సి వచ్చిందిట!"

మళ్ళీ పకపకా నవ్వేడు. కాస్సేపలా నవ్వి గుక్క తిప్పుకుని.

"ఇక్కడ దేవుడి నీడలో జరగని పాపం అంటూ లేదు. దానికి నిజంగా మొగుడున్నాడనుకుంటున్నారా? ఊహు.... మొగుడూ లేడు ముచ్చూ లేడు. అదో ట్రిక్కు. ట్రేడ్ ట్రిక్కు" అని కూర్చుని

"దేవుడూ.... ఉక్కపోస్తోంది కాస్త ఫేను జోరు పెంచు" అని గ్లాసు టేబిలు మీద పెట్టి సీసా తీసేడు. దానికింద నుంచి ఒకకాగితం ముక్క ఎగిరెళ్ళి రామస్వామి ముందు ఆగింది.

రామస్వామి కాగితం చదువుకుని లేచి చిందులేసేడు. అతని చేతిలోంచి దేవుడమ్మ లాక్కుని చదివేడు. తర్వాత దిగాలుగా చిదంబరం చేతిలో పెట్టేడు.

"టీపాయ్‌కింద నా పంచిలో టేప్‌రికార్డరుంది. అందులో రికార్డయిన మీ సంభాషణ తిరిగి తీసుకోవాలంటే పదివేలతో పాపనాశనం దగ్గరకి తెల్లవారకముందే రండి."

అందరూ మౌనంగాకూర్చుండిపోయేరు అయిదు నిమిషాల తర్వాత

"చిదంబరంగారూ మీరే రక్షించాలి. పదివేలూ నేనే ఇచ్చుకుంటాను" అన్నాడు మలేరియా పేషెంటులా వణికిపోతూ జస్టిస్ రామస్వామి. ●

